క్లుప్తంగా

ముమ్మరంగా ట్యాంకుల క్లోరినేషన్



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికుడు

నారాయణఖేడ్: వర్షాకాలం సమీపిస్తుండడంతో కలుషిత నీటితో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున నారాయణఖేడ్ మున్సిపాలిటీలో ముందస్తు చర్యలు చేపట్టారు. మున్సిపాల్టీ పరిధిలో 14 ట్యాంకులు ఉండగా ఆదివారం 8 ట్యాంకుల వద్ద పేరుకుపోయిన చెత్త, పాదలను తొలగించారు. బ్లీచింగ్ పౌడరు చల్లి ట్యాకుల్లో క్లోరినేషన్ చేశారు. పట్టణ శివారులో ఉన్న సంపులో సైతం క్లోరినేషన్ చేపట్టారు. ఆయా పనులను మున్సిపల్ వైస్ దారంశంకర్ పర్యవేక్షించారు. మూడు రోజుల్లో అన్నిట్యాంకుల వద్ద క్లోరినేషన్ చేయనున్నట్లు చెప్పారు.

మౌలిక వసతులు కల్పించాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలని టీటీయూ జిల్లా అధ్యక్షుడు పి.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని, తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని, మరుగుదొడ్లు నిర్మించాలని, చిన్నచిన్న మరమ్మతులు చేయించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం విద్యావ్యవస్థపై సుముఖతతో ఉండటం శుభపరిణామమన్నారు.

చాకిచెరువులో మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం

హత్నూర (సంగారెడ్డి): స్థానిక చాకిచెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ సుభాష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం స్థానిక చాకి చెరువులో ఆదివారం ఓ వ్యక్తి మృతదేహం తేలిఉండడం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 36 సంవత్సరాలు ఉండవచ్చని ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, ఎవరైనా మృతదేహాన్ని గుర్తుపట్టినట్లయితే ఈ నంబర్లకు 87126 56752, 80196 56750లో పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

ఘనంగా భవానీ మాత ఆలయ వార్షికోత్సవం



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

జహీరాబాద్ టౌన్: మండలంలోని ఒంటెల గడ్డ తండాలో ఆదివారం భవానీ మాత, సేవలాల్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. తండాలో దేవాలయాలు నిర్మించి 31 సంవత్సరాలు అయిన సందర్భంగా గిరిజనులు ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు కలశలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఉద్యోగాల పేరుతో ఫోన్లు వస్తే నమ్మొద్దు

విద్యుత్ ఏఈ శ్రీనివాస్

జోగిపేట(అందోల్): విద్యుత్‌శాఖలో ఉద్యోగాలు ఉన్నాయంటూ ఫేక్ కాల్స్ చేసి కొందరు మోసం చేస్తున్నారని, అలాంటి వాటిని నమ్మొద్దని అందోలు మండల టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఏఈ శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ డిపార్టుమెంట్‌లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలున్నాయని, నెలకు రూ.30వేలు జీతం ఇస్తామని, అప్లికేషన్ చేసుకునేందుకు ముందుగా రూ.1,400 పంపాలని ఫోన్లుచేసి అడుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. డిపార్టుమెంట్‌లో ప్రస్తుతం ఎలాంటి నియామకాలు జరగడంలేదని, ఎవరికీ డబ్బులు చెల్లించి మోసపోవద్దని ఆయన సూచించారు. ఈ విషయమై జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఎవరికైనా అలాంటి ఫోన్‌కాల్స్ వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

స్క్రాప్ గోదాములు.. యమడేంజర్



అగ్నిప్రమాద దృశ్యం(ఫైల్)

- అనుమతులు లేకుండా నిర్వహణ
- రసాయన డ్రమ్ముల నిల్వలు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న స్క్రాప్ గోదాములు ప్రమాదాలకు చిరునామాలుగా మరాయి. నిబంధనలకు విరుద్ధంగా రసాయన డ్రమ్ములను నిల్వ ఉంచడంతో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ ప్రమాదాల వల్ల సమీపంలోని పరిశ్రమల యాజమాన్యాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అనుమతులు లేని గోదాముల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి.

– జిన్నారం(పటాన్‌చెరు)

పటాన్‌చెరు నియోజకవర్గంలోని పాశమైలారం, బొల్లారం, ఖాజీపల్లి, బొంతపల్లి తదితర పారిశ్రామికవాడల్లో వందల సంఖ్యలో స్క్రాప్ గోదాములు ఉన్నాయి. అనుమతులు లేని ఈ గోదాముల్లో రసాయన డ్రమ్ములను నిల్వ ఉంచడంతో తరచు అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాటిని తొలగించడంలో పీసీబీ అధికారులు, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పదిపైనే ప్రమాదాలు..

యేడాది కాలంలో జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని ఆయా పారిశ్రామిక వాడల్లో పది అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ఈ ఘటనల్లో ఎలాంటి ప్రాణహాని జరగకపోయిన భారీగా ఆస్తినష్టం జరుగుతోంది. డ్రమ్ముల్లోని రసాయనాలకు మండే గుణం ఉండడం వల్ల మంటలు వ్యాపిస్తున్నాయి. దీంతో భారీగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు మాత్రం వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బొంతపల్లిలో అగ్నిప్రమాదం

తాజాగా గుమ్మడిదల మండలంలోని బొంతపల్లిలో ఓ స్క్రాప్‌గోదాంలో అగ్ని ప్రమాదం జరగడంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలు వెలువడి ఘాటు వాసనలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమీపంలోని పరిశ్రమలకు కూడా మంటలు వ్యాపిస్తాయేమోనని పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమల యాజమాన్యాలు కూడా ఆందోళన వ్యక్తం చేశాయి. తక్షణమే అనుమతులు లేని గోదాములను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా పారిశ్రామిక గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు.

పోలీసుల విచారణ

బొంతపల్లిలోని స్క్రాప్ గోదాంలో జరిగిన అగ్ని ప్రమాదంపై పోలీసులు ఆదివారం విచారణ జరిపారు. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. దానికి సంబంధించిన పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని, గోదాములు నడుపుతున్న తీరుపై విచారిస్తామని ఎస్ఐ తెలిపారు.



విచారణ జరుపుతున్న ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి



కల్వర్టు వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

కుంగిన కల్వర్టు.. ఆదమరిస్తే అంతే

- ప్రమాదకరంగా మారిన గుంత
- పట్టించుకోని అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేని తనం, ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టకపోవడంతో రహదారులపై రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. జహీరాబాద్ పట్టణ పరిధిలోని అల్గోల్ గ్రామం నుంచి ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి గ్రామం వరకుపొట్టి పల్లి గ్రామం మీదుగా బీటీ రోడ్డు నిర్మించారు. పొట్టిపల్లి, ఎల్గోయి గ్రామాల మధ్య కల్వర్టు ఉంది. కల్వర్టు కుంగిపోయి ఉన్నప్పటికీ ఎలాంటి మరమ్మతులు చేపట్టకుండా రోడ్డు వేశారు. రోడ్డు వేసిన కొన్ని నెలలకే కల్వర్టు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. పలుమార్లు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కింద పడిపోయి స్వల్ప గాయాలపాలైన సందర్భాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో వాహనదారులు గుంత కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని కల్వర్టు వద్ద మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులోని వెంకటాచల దివ్యక్షేత్రంలో పద్మావతి గోదా సమేత అద్భుత వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే కుమారుడు చింతా సాయినాథ్, ఆలయ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి సదాశివపేట పట్టణంలోని పాత పెరుమాళ్ల హనుమాన్ మందిరం నుంచి గాంధీ చౌక్, ఇశ్రితాబాద్, వెంకటాపూర్ నుంచి ఆలయం వరకు ఘనంగా రథోత్సవం నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

గ్రామీణ ప్రాంతాలకు 'లయన్స్' సేవలు



నూతన సభ్యులను సన్మానించిన నిర్వాహకులు

- క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ రవీందర్‌గౌడ్

జోగిపేట/వట్‌పల్లి(అందోల్): లయన్స్ క్లబ్‌ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సేవలను అందించాలని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్.రవీందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం జోగిపేట లయన్స్ భవన్‌లో నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా గుణాన్ని కలిగి ఉండాలన్నారు. ఏమీ ఆశించకుండా సేవలను అందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని చెప్పారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు అల్లెశ్రీకాంత్, మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి జి.సంతోష్‌కుమార్, జోన్ చైర్మన్ రామకృష్ణలను సన్మానించారు. మాజీ లయన్స్‌క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎస్.రవీందర్‌గౌడ్‌ను నూతన అధ్యక్షుడు శ్రీకాంత్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అనంతరెడ్డి, ఎస్.జగన్మోహన్‌రెడ్డి, ఎస్.నారాయణరెడ్డి, ఎ.రాంబాబు, యశ్వంత్‌రెడ్డి, జగదీశ్వర్, మాణిక్‌రెడ్డి, విఠల్‌రావు తాండ్లే, బస్వ దయానంద్ పాల్గొన్నారు.

గణేశ్ గడ్డ ఆలయానికి భక్తుల తాకిడి

పటాన్‌చెరు టౌన్: సంకటహర చతుర్థి సందర్భంగా పటాన్‌చెరు మండలం రుద్రారం గణేశ్ గడ్డ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్ తెలిపారు. ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.



ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

బ్రాహ్మణ సమాజం నూతన కార్యవర్గం

కంగ్టి(నారాయణఖేడ్): బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ మండల నూతన కార్యవర్గం ఎన్నిక శ్రీసీతా రామాంజనేయ ఆలయంలో నిర్వహించారు. సేవా సంస్థ నియోజకవర్గం అధ్యక్షుడు కిషన్‌రావు దేశ్‌పాండే ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మండల నూతన అధ్యక్షుడుగా వెంకట్‌రావు దేశాయి, ఉపాధ్యక్షుడుగా కల్యాణ్ జోషి, ప్రధానకార్యదర్శిగా రఘునాథ్‌రావు దేశాయి, గౌరవ అధ్యక్షుడుగా అక్షయ్‌జోషి, కోశాధికారిగా శ్రీనివాస్ జోషి, కార్యవర్గ సభ్యులుగా సంతోష్ పూజారి, జయకిషన్ మహారాజ్, రఘునందన్, రాందాస్ దేశ్‌ముఖ్, నందకుమార్ జోషి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాజేశ్వర్‌రావు, కృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



పరిసరాలను శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

- మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు వద్ద స్వచ్ఛ సర్వేక్షణ్ -2024లో భాగంగా చెరువు పరిసరాలలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు పరిసర ప్రాంతాల్లో అనేక మంది చెత్తను వేస్తున్నారని అది సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొనడం హర్షదాయకమన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒకరు వారి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంటి పరిసరాలలో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ, ఏఈ సంజయ్ పాల్గొన్నారు.

డ్రైనేజీలు నిర్మించండి



ధ్వంసమైన మురుగు కాలువ

నారాయణఖేడ్: మండల కేంద్రమైన నాగల్‌గిద్ద గ్రామంలోని చాలా కాలనీల్లో మురుగు కాల్వలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ మురుగునీరు రోడ్లపై పారుతోందని వాపోయారు. ధ్వంసమైన మురుగు కాల్వల స్థానంలో నూతనంగా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

సొసైటీ కార్యాలయం ఎదుట నిరసన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీ సొసైటీ కార్యదర్శి ఎల్.మోహన్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సొసైటీ భవనం ఎదుట కాలనీవాసులు నిరసన తెలిపారు. సొసైటీ అధ్యక్షుడితోపాటు మరి కొంత మంది కారణమని ఆరోపిస్తూ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలో పనులను చేయకుండానే పనులు చేసినట్టు కాలనీ అధ్యక్షుడు పలువురు డైరెక్టర్లను కలుపుకొని నగదును డ్రా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నిజాయితీపరుడైన కార్యదర్శి ఎల్.మోహన్, ఉపాధ్యక్షుడు మధుసూదన్, కోశాధికారి వెంకటయ్య దానిని అడ్డుకున్నారన్నారు. దీంతో ఆముగ్గురిపై అధ్యక్షుడు ఇతర డైరెక్టర్లు కలసి అవిశ్వాస తీర్మానం పెట్టారని, అవిశ్వాస లేఖను చూసి కార్యదర్శి ఎల్.మోహన్ మనోవేదన చెంది మృతి చెందారని వాపోయారు. ఆయన మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు



రాయికోడ్(అందోల్): బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రాయికోడ్(అందోల్): మండలంలోని హుల్గేర గ్రామంలో రెండు రోజులుగా బీరప్ప స్వామి జాతర వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం నిర్వహించిన బోనాల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తి గ్రామంలోని వివిధ వాడల గుండా ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామ కూడలి నుంచి ఆలయం వరకు బోనాల ఊరేగింపు ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, భక్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి దేవతామూర్తులకు సమర్పించిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జాతర..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప జాతరను ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఉదయమే నైవేద్యాలతో స్వామిని దర్శించుకొని, సాయంత్రం బోనాలను సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు నిర్వహించారు. ఒగ్గు కళాకారులు బీరప్ప కథ బాగోతం ఆడారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు అంజన్న, శ్రీహరి, శ్రీశైలం, కృష్ణ, మల్లమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మామిడి పండ్ల పండుగ



మామిడి పండ్ల గురించి వివరిస్తున్న రైతులు

- డీడీఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శన
- ఆసక్తిగా పాల్గొన్న ప్రజలు

జహీరాబాద్: మండలంలోని దిడిగి గ్రామ శివారులోగల కేవీకేలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన మామిడిపండ్ల పండుగ అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం నిర్వహించిన ఈ పండుగలో మామిడ్గి, మెటల్‌కుంట, బిడకన్నె, శేఖాపూర్ గ్రామాలకు చెందిన రైతులు తమ పొలంలో పండించిన మామిడి పండ్లను ప్రదర్శించారు. కమర్షియల్ రకాలైన బేనిషాన్, ఎర్రమూతి మామిడి, నల్ల మామిడి వంటి అరుదైన 28రకాలను ఉంచారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త వరప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పురాతన కాలం నుంచి వివిధ రకాల మామిడి చెట్లు ఉన్నాయన్నారు. అప్పట్లో నిజాం రాజులు ఎంతో ఇష్టపడి ఇక్కడి మామిడి పండ్లను తెప్పించుకుని తినేవారని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్లో అమ్మకాలు లేవని పాతరకాలను విస్మరిస్తున్నారని వాపోయారు. వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, అవగాహన కోసం ఇలాంటి పండుగలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రైతు బిడకన్నె చంద్రమ్మ మాట్లాడుతూ ఒకప్పుడు ఊర్లో ఎన్నో రకాల మామిడి పండ్లు దొరికేవన్నారు. నేడు అవి మర్చిపోతూ అన్నింటికీ మార్కెట్‌పైనే ఆధారపడుతున్నామన్నారు. రసాయనాలతో పండించిన పండ్లను తిని అనారోగ్యాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యాన సైంటిస్టు కె.శైలజ మాట్లాడుతూ నేడు మామిడి పండ్లు అంటే 4 నుంచి 5 రకాలు మాత్రమే గుర్తిస్తారన్నారు. కాని ఆరోగ్యానికి ఉపయోగపడే రసాల పండ్లతో పాటు పచ్చడికి పనికివచ్చేవి, సువాసనతో ఉండే పండ్లు కూడా ఉన్నాయన్నారు. ప్రదర్శన అనంతరం రకరకాల మామిడిపండ్ల వంటకాలతో భోజనాలు ఏర్పాటు చేశారు.



ప్రదర్శనలో ఉంచిన పలు రకాల మామిడిపండ్లు

'అమ్మ ఆదర్శ'తో స్కూళ్ల అభివృద్ధి

ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగానే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు శ్రీకారం చుట్టింది. స్కూల్స్ తెరిచే నాటికి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తోంది.

– సదాశివపేట రూరల్(సంగారెడ్డి)

- 45 పాఠశాలలకు రూ.1.56కోట్లు
- వేగంగా కొనసాగుతున్న పనులు
- బడులు తెరిచే నాటికి పూర్తి
- తాగునీరు, టాయ్‌లెట్లపై ప్రత్యేక దృష్టి

సదాశివపేట మండలంలో 70ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో 45పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసి, వాటి అభివృద్ధికి రూ.1.56కోట్లు మంజూరు చేశారు. కార్పొరేట్ తరహాలో అభివృద్ధి పనులను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. నిత్యం జిల్లా, మండల అధికారులు పర్యవేక్షిస్తూ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. తాగునీటి సౌకర్యం కల్పన, మరుగుదొడ్లకు మరమ్మతులు, విద్యుదీకరణ, రంగులు వేయించడం, గ్రీన్ చాక్ బోర్డులు, సోలార్ ఫ్యాన్ల ఏర్పాటు లాంటి పనులను చేపడుతున్నారు. గ్రామాల్లో గ్రామ సమాఖ్య మహిళా సంఘాల ఆధ్వర్యంలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే గ్రామ సంఘం అధ్యక్షురాలు, సంబంధిత పాఠశాల హెచ్‌ఎంల పేరిట బ్యాంకు ఖాతాలు తెరిచారు.



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్(ఫైల్)

అన్ని వసతులు కల్పిస్తాం..



అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. తాగునీరు. మరుగుదొడ్డి సౌకర్యాలతో పాటు చిన్న చిన్న మరమ్మతులు కొనసాగుతున్నాయి. పాఠశాలలు తెరిచే నాటికి ప్రభుత్వ బడుల్లో అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం.

– దండు అంజియ్య, ఎంఈఓ సదాశివపేట